ప్రశాంతంగా గ్రూప్‌-1 పరీక్షలు



సిద్దార్థ కాలేజీ వద్ద హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

మలక్‌పేట: మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వహించిన గ్రూప్‌-1 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. దిల్‌సుఖ్‌నగర్‌లోని వెంకటేశ్వర డిగ్రీ కాలేజీ, సిద్దార్థ డిగ్రీ కాలేజీ, ప్రగతి డిగ్రీ కాలేజీ, అనిబీసెంట్ డిగ్రీ కాలేజీ, సెయింట్ డామ్నిక్స్ హైస్కూల్, సాయి చైతన్య జూనియర్ కాలేజీ, సాకేత డిగ్రీ కాలేజీ, నోబుల్ డిగ్రీ కాలేజీల్లో సెంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 3956 మంది అభ్యర్థులకు 2483 మంది హాజరుకాగా, 1473 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. సెంటర్ల వద్ద మలక్‌పేట పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనిబీసెంట్ డిగ్రీ కాలేజీ సెంటర్‌కు ఏడుగురు, ప్రగతి డిగ్రీ కాలేజీ సెంటర్‌కు ముగ్గురు, వెంకటేశ్వర కాలేజీ సెంటర్‌కు ముగ్గురు, సిద్దార్థ కాలేజీ సెంటర్‌కు ఇద్దరు, నోబుల్ కాలేజీ సెంటర్‌కు ముగ్గురు అభ్యర్థులు ఆలస్యంగా వచ్చారు. అధికారులు వారిని లోపలికి అనుమతించలేదు. వారు అధికారులను కొంతసేపు బతిమాలిన ప్రయోజనం లేకపోవడంతో అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ధి

ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: ముఖ్యమంత్రి సహాయనిధితో ఎంతో మంది పేదలకు లబ్ధి చూకూరుతోందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గడ్డి అన్నారం డివిజన్ వీవీనగర్‌లో నివాసం ఉండే చంద్రమతి కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నారు. ఆపరేషన్ చేయించుకొనేందుకు ఆర్థిక స్తోమత లేక పోవటంతో ఎమ్మెల్యేను సంప్రదించారు. ఆయన సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించగా, రూ. 1.5 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీ చెక్కును బాధితురాలి భర్త రామకృష్ణకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం సహాయ నిధి పేదలకు ఓ వరం వంటిదన్నారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, నాయకులు అనంతుల రాజిరెడ్డి, చాతిరి మధు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లును తీసేయండి

కాలనీల ప్రజల డిమాండ్



మాట్లాడుతున్న కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు

హయత్‌నగర్: అన్మగల్ హయత్‌నగర్‌లో ఉన్న ఓ రైస్‌మిల్లు కారణంగా తాము తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, వెంటనే దానిని ఇక్కడి నుంచి తీసేయండి డివిజన్‌లోని ఆలూరి కాలనీ, బ్లూసమ్ సిటీ, స్వగృహ కాలనీల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం సమావేశమైన ఆయా కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు మాట్లాడుతూ... నివాసాల మధ్య ఉన్న ఈ రైస్‌మిల్లు నుంచి వస్తున్న దుమ్ము, ధూళి వల్ల తాము శ్వాసకోశ వ్యాధులతోపాటు ఇతర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నామని తెలిపారు. రాత్రింబవళ్లు రైస్ మిల్లుకు భారీ వాహనాలు తమ కాలనీల రోడ్లపై నుంచి రాకపోకలు సాగిస్తుండటంతో శబ్ద, వాయు కాలుష్యం ఏర్పడుతోందని, తాగునీటి, డ్రైనేజీ పైప్ లైన్లు పగిలిపోతున్నాయని వారు వాపోయారు. రైస్ మిల్లు కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. రైస్ మిల్లును అధికారులు ఇక్కడి నుంచి తరలించకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలూరి కాలనీ ప్రెసిడెంట్ ఆలూరి, బ్లూసమ్ సిటీ అధ్యక్షులు జైభారత్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, హర్షవర్ధన్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, ప్రబాకర్, కృష్ణ, విజయభాస్కర్ రెడ్డి, కృష్ణారెడ్డి, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలు పరిష్కరించకుంటే జలమండలి ముట్టడి

కార్పొరేటర్ పవన్ కుమార్ హెచ్చరిక



మారుతినగర్‌లో డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించకుంటే జలమడలి ముట్టడిస్తామని స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని మారుతినగర్ కాలనీలో ఆదివారం కార్పొరేటర్ పర్యటించి డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, పలు కాలనీల్లో డ్రైనేజీ సమస్య రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. లేని యెడల డివిజన్ పరిధిలోని కాలనీల వాసులతో కలిసి జలమడలి ముట్టడి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు మల్లేష్, శ్రీనివాస్, సురేష్, మల్లికార్జున్, అల్వాల్‌రెడ్డి, తోట మహేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

క్రమశిక్షణ పెంపునకు క్రీడలు దోహదం



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో హెడ్‌కోచ్ శివకుమార్ తదితరులు

మన్సూరాబాద్: విద్యార్థుల్లో క్రమశిక్షణ, పోటీతత్వం పెంపునకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని శివాజీ అకాడమీ హెడ్ కోచ్ శివకుమార్ అన్నారు. అకాడమీలో ఈ ఏడాది ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ ముగింపు సమావేశం మన్సూరాబాద్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం కోచ్ శివకుమార్ మాట్లాడుతూ, తమ అకాడమీలో శిక్షణ తీసుకున్న విద్యార్థులు అనేక విజయాలు సాధించి పేరు ప్రఖ్యాతలు పొందారని తెలిపారు. మరికొంత మంది విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'బద్దూరి'కి జన్మదిన శుభాకాంక్షలు



వెంకటేశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న మధుయాష్కీ గౌడ్

చైతన్యపురి: తెలంగాణ రెడ్డి సంఘాల కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వరరెడ్డి జన్మదిన వేడుకలు చైతన్యపురి హనుమాన్‌నగర్‌లో జరిగాయి. పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై వెంకటేశ్వరరెడ్డితో కేక్ కట్ చేయించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శశిధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఆయన అభిమానులు, స్నేహితులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎప్పుడు కూలిపోతుందో!

- వర్షాలకు సగం కూలిన పాఠశాల ప్రహరీ
- మిగతా గోడకు కూడా పగుళ్లు
- ఆందోళనలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు



మన్సూరాబాద్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కూలిన ప్రహరీ



పాఠశాలలో పగుళ్లు తీసి ప్రమాదకరంగా ఉన్న ప్రహరీ

మన్సూరాబాద్: ఇటీవల కురిసిన వర్షాలకు మన్సూరాబాద్ చౌరస్తా సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీ కొంత భాగం కూలిపోయింది. ఈ పాఠశాల ప్రాంగణంలో పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రం ఉంది. కూలిన ప్రహరీ అంగన్‌వాడీ కేంద్రం ద్వారానికి అడ్డుగా పడింది. దీంతో గత పది రోజులుగా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. మిగిలిన ప్రహరీ కూడా పగుళ్లు తీసి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ నెల 12న పాఠశాలలు పునః ప్రారంభం కానుండని, అయితే, పగుళ్లు తీసిన ప్రహరీ ఎప్పుడు కూలుతుందోనని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ప్రమాదం జరగక ముందే కూలేందుకు సిద్ధంగా ఉన్న ప్రహరీని తీసేసి కొత్త ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 31, వంకాయ 23, బెండ 40, పచ్చిమిర్చి 60, కాకర 38, బీర 40, క్యాలీఫ్లవర్23, క్యాబేజీ 21, క్యారెట్ 40. దొండ 18, ఆలు 34, ఉల్లి 32, గోకర 40, దోస 28, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 50, అర్వి 40, మునగ 50, చిలగడదుంప 45, బీట్‌రూట్ 23, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 95, కాప్సికమ్ 65.ఈ ధరలు సోమవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'నారాయణ'కు ర్యాంకుల పంట

సాక్షి, సిటీబ్యూరో: తాజాగా ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో దిల్‌సుఖ్‌నగర్‌లోని డే డివిజన్ నారాయణ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. అన్ని కేటగిరీల్లో కలిపి 100లోపు జాతీయస్థాయి ర్యాంకు ఒకటి, 500లోపు 9, 1000 లోపు ర్యాంకులు 16, 2 వేల లోపు ర్యాంకులు 37, 5 వేల లోపు ర్యాంకులు 71, 10వేల లోపు ర్యాంకులు 85.. తమ విద్యార్థులు సాధించారని నారాయణ దిల్‌సుఖ్‌నగర్ డే డివిజన్ కోర్ డీన్ రాధాకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థుల, అధ్యాపకులను ఆయన అభినందించారు. డీన్ అమరేందర్, డీజీఎం కేపీఎస్ రాజు, ఏజీఎం గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం కేటాయించాలి

ఉద్యమ కారుల ఫోరం మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగయ్య గౌడ్



సమావేశంలో పాల్గొన్న నాయకులు

తుర్కయంజాల్: సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వెంటనే 250 గజాల ఇంటి స్థలాన్ని ఉద్యమకారులకు కేటాయించాలని ఉద్యమ కారుల ఫోరం మున్సిపాలిటీ అధ్యక్షుడు నక్క జంగయ్య గౌడ్ కోరారు. ఆదివారం తుర్కయంజాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ పిలుపు మేరకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఉద్యమ కారులకు ఇళ్ల స్థలాలు కేటాయించే వరకూ పోరాటం చేస్తామన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం ప్రకాశ్, విక్రం రెడ్డి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న సాంస్కృతిక పోటీల దరఖాస్తులు

రంగారెడ్డి కోర్టులు: న్యాయవాద పరస్పర సహకార సంఘం స్థాపించి 25ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈనెల 15న శుభమ్ కన్వెన్షన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు (పోటీలు) నిర్వహించనున్నారు.

ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే వారు సోమవారంలోపు దరఖాస్తు చేసుకోవాలని సంఘం సంచాలకుడు బాచిరెడ్డి శాయిరెడ్డి తెలిపారు. వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన న్యాయవాదుల పిల్లలకు నగదు పురస్కారం అందిచనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవల్సిందిగా వారు ఈ సమావేశంలో తెలియజేసారు.

ఘనంగా 'జక్కిడి' జన్మదిన వేడుకలు



జక్కిడి ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మధుయాష్కీ గౌడ్

మన్సూరాబాద్: టీపీసీసీ ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం రాత్రి మన్సూరాబాద్ సెంట్రల్ బ్యాంక్ కాలనీలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ హాజరయ్యారు. కేక్‌ను కట్ చేసి శాలువాలతో జక్కిడి ప్రభాకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు వజీర్ ప్రకాష్ గౌడ్, సతీష్‌రెడ్డి, బేర బాలకిషన్, కేవీఎస్‌రెడ్డి, జాల వెంకట్‌రెడ్డి, కొప్పుల వెంకట్‌రెడ్డి, గంట శ్రవణ్, పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి పరిరక్షించాలి



మొక్కలు నాటుతున్న డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి

లింగోజిగూడ: ప్రజలందరి భాగస్వామ్యంతోనే పకృతి పరిరక్షణ సాధ్యం అవుతుందని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ సంస్థల చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని శ్రీనివాస కాలనీలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంస్థల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పాల్గొన్న రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ వైస్ చైర్మన్ డాక్టర్ సుభాష్ చంద్ర, ఎన్‌జీఓఎస్ కన్వీనర్ డాక్టర్ సురేందర్, సభ్యులు చైతన్యరెడ్డి, రఘురాం, సౌజన్య, రమణ, శివారెడ్డి, నవీన్, గణేష్, పవన్‌సాయి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భారతీ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణం వేగవంతం

సంస్థ టెక్నికల్ ఇంజినీర్ బద్రి



సమావేశంలో పాల్గొన్న బద్రి తదితరులు

తుర్కయంజాల్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతీ సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్‌సెట్టింగ్ సిమెంట్ ఫైవ్‌స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ బద్రి తెలిపారు. ఆదివారం మహాలక్ష్మి సిమెంట్ ట్రేడర్స్ డీలర్ షాప్‌లో తాపీమేస్త్రీలతో సమావేశం ఏర్పాటు చేసి మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతీ అల్ట్రాఫాస్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తి అవుతుందని తెలియజేశారు. ఈ సిమెంట్‌తో ముఖ్యంగా స్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణానికి సరైన ఎంపికయిందని చెప్పారు. అల్ట్రా ఫాస్ వినియోగదారులకు ఉచితంగా సాంకేతిక సహాయం అందజేస్తామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతీ సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడుతారని తెలిపారు. అనంతరం డీలర్ శివ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఇతర సిమెంట్లతో పోలిస్తే దీని ధర రూ.20 అధికంగా ఉంటుందని అయినప్పటికీ నాణ్యత బాగుటుందని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ మార్కెటింగ్ రామకృష్ణ, టెక్నికల్ అధికారి సాహెర్, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

బండి సంజయ్, కిషన్‌రెడ్డిలకు సత్కారం



బండి సంజయ్‌ను సన్మానిస్తున్న కొప్పుల నర్సింహారెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి తదితరులు



సన్మానిస్తున్న మొద్దు లచ్చిరెడ్డి, సామ రంగారెడ్డి



కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి

మన్సూరాబాద్/ సైదాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించి కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న ఎంపీలు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు మార్‌లను పలువురు బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు న్యూఢిల్లీలో ఆదివారం ఉదయం మర్యాదపూర్వకం కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. సన్మానించిన వారిలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి, బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, మొండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు క్లొం రవీందర్‌రెడ్డి, వన్‌పల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మేయర్‌కు వినతి



బడంగ్‌పేట్: కాలనీల్లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాతకు పలు కాలనీవాసులు వినతిపత్రాలు సమర్పించారు. కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్ న్యూతిరుమలనగర్, హనుమాన్‌నగర్, అరవింద్‌నగర్ చెందిన కాలనీసులు మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మేయర్‌ను కలిసి విన్నవించారు. కాలనీల్లో పేరుకుపోయిన డ్రైనేజీ, రోడ్లు, వాటర్, వీధిలైట్లు ఇతర మౌలిక వసతులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులు గమనించి సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పొదుపు సంఘం వార్షికోత్సవం

మహేశ్వరం: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో నవకారిక ప్రగతి సొసైటీ పొదుపు సంఘం 12వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. 12 ఏళ్ల నుంచి కొనసాగిన ఆర్థిక లావాదేవీలపై ఈ సందర్భంగా సభ్యులు చర్చించారు. సంఘంలో నూతనంగా అమలు చేయనున్న పథకాల విషయమై ప్రస్తావించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా నవపేట ఆంజనేయులు, ముఖ్య సలహాదారుడిగా రాహులగల్ల యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా నర్సింహా యాదవ్, కోశాధికారిగా బాస శంకర్, ఉపాధ్యక్షుడిగా సత్తమ్మ, సహాయ కార్యదర్శిగా కావలి మహేశ్, పాలక వర్గ సభ్యులుగా వి.సునిల్, రంగం మహేశ్, స్వరూప, కె.శ్రీకాంత్‌లు ఎన్నికయ్యారు.

పర్యావరణ ప్రాముఖ్యతను తెలిపేందుకే నేచర్ క్యాంప్‌లు

ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్



నేచర్ క్యాంపులో గుడారాలు వేస్తున్న పిల్లలు

మొయినాబాద్: పిల్లలకు వివిధ రకాల చెట్లు, పర్యావరణ ప్రాముఖ్యతను తెలియజేయడానికే నేచర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ అన్నారు. మొయినాబాద్ మండలం చిలుకూరు ఫారెస్ట్ ట్రెక్ పార్కులో ఎకో టూరిజం కార్యక్రమాల్లో భాగంగా వాన్డేరింగ్ బీ హాలిడేస్ ఆర్గనైజేషన్ సహకారంతో నేచర్ క్యాంపు నిర్వహించారు. శనివారం సాయంత్రం 4 నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకు జరిగిన క్యాంపులో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 24 మంది పాల్గొన్నారు. నేచర్ క్యాంపునకు వచ్చిన పిల్లలకు వివిధ రకాల చెట్లను చూపించి వాటి ఉపయోగాలను వివరించారు. హైకింగ్, టీం బిల్డింగ్, టెంట్ ఫిక్సింగ్ (గుడారాలు), నైట్ ట్రెక్కింగ్, క్యాంపుఫైర్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం బర్డ్‌వాక్ కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల పక్షులను చూపించి వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎకో టూరిజం ప్రాజెక్ట్స్ మేనేజర్ కళ్యాణపు సుమన్, వాండేరింగ్ బీ సంస్థ ప్రతినిధి రాఘవేంద్రప్రసాద్, బోటనిస్ట్ వీరకిషోర్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే సబితారెడ్డి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెలే సబితారెడ్డి

మీర్‌పేట: సేవా కార్యక్రమాల్లో ముందుండే ఆర్యవైశ్యులకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఎస్‌వైఆర్ కన్వెన్షన్‌లో జరిగిన మీర్‌పేట కార్పొరేషన్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తన గెలుపు కోసం కృషి చేసిన ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. పేద విద్యార్థులను గుర్తించి వారి చదువుల కోసం సంఘం ఇస్తున్న ప్రోత్సాహం అభినందనీయమన్నారు. అలాగే, సమాజంలో వెనుకబడిన వారికి ఆర్యవైశ్యులు సహాయం చేసే శక్తిని వాసవీమాత అమ్మవారు ఇవ్వాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ ఉప్పల్‌లో సంఘానికి కొంత స్థలాన్ని కేటాయించారని, ఈ స్థలంలో భవనం నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వంతో మాట్లాడి చొరవ తీసుకుంటానని చెప్పారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా మంచన ప్రేమ్‌కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా రవీందర్ గుప్తా, కోశాధికారిగా శ్యాంప్రసాద్‌గుప్తా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మంచన శుభకుమార్‌గుప్తాతో పాటు పలువురు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, సంఘం రాజకీయ కమిటీ చైర్మన్ రవికుమార్ గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, శ్రీరామచంద్రమూర్తి గుప్తా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.